ప్రజాశక్తి
శనివారం 3 ఆగస్టు 2024
5
అల్లూరి సీతారామరాజు

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఉపాధి హామీ కూలీలకు బకాయిలు తక్షణమే ప్రభుత్వం చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో స్థానిక విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, గౌరవ అధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలు పని చేసి 9 వారాలైనా బకాయిలు విడుదల చేయలేదని, తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నాలుగు లక్షల 59 వేల మంది కూలీలు ఉపాధి పొందుతున్నారని, సకాలంలో కూలి డబ్బులు చెల్లించక పోతే ఎలా బతుకుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతంలో ఉపాధి కూలీ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ఉపాధి కూలీలు బకాయి పడ్డ డబ్బులు చెల్లించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున కూలీలతో కలిసి కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని, అధికారులని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తాముల జోషి, కొర్ర సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

పిరిబంధలో పాఠశాల భవనం నిర్మించరూ..

చేతులు జోడించి వినూత్న నిరసన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద పివిటిజి గ్రామంలో నూతన పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శుక్రవారం రెండు చేతులు ఎత్తి మోకాళ్ళతో మొక్కుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు మాట్లాడుతూ, పిరిబంధ మండల పరిషత్ పాఠశాలలో సుమారు 30 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. పాఠశాల భవనం లేక రేకు షెడ్డులో విద్యను అభ్యసిస్తున్నారని చెప్పారు. 2022 సంవత్సరంలో తుపాను కారణంగా పాత భవన కూలి పోయిందని, అదే రోజు సెలవు కావడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పిందని తెలిపారు.ఈ విషయంపై గతంలో స్పందన కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చినబాబు అనేక సార్లు అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, దీంతో గ్రామస్తులు నిర్మించిన రేకు షెడ్డు లో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. వర్షా కాలం వస్తే షెడ్డులోకి నీళ్ల చేరి నిల్వ ఉండిపోతుందని, దీంతో చలికి తరగతి గదిలో కూర్చోవడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వానికి ఎన్ని సార్లు విన్నవించినా పిరిబంద గ్రామానికి పాఠశాల భవనం మంజూరు కాలేదని తెలిపారు. దీంతో ఇబ్బందులు పడుతూనే విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం స్పందించి పివిటీజి గ్రామానికి పాఠశాల భవనం మంజూరు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమం ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు పినాని బాబు, సుంకరమెట్టు సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు, గ్రామస్తులు శారదా, నర్సమ్మ, అరషో, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారి గుంతలమయం

ప్రజాశక్తి-చింతపల్లి: ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గుంతల మయమయ్యాయి. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని చెరువులను తలపిస్తున్నాయి. చింతపల్లి మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధి లోతుగడ్డ జంక్షన్ గ్రామంలో రోడ్లు ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో, అటువైపుగా వెళ్లే వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, అందులో నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత కొన్నేళ్ల నుంచి ఈ రోడ్డు గుంతలతోనే దర్శన మిస్తోందని, అధికారులు మరమ్మత్తు పనులు చేపట్టకపోవడం విచారకరమని ఆరోపించారు. గిరిజనులు ఇదే మార్గం గుండా అన్నవరం, జి మడుగుల, పాడేరు వెళుంటారని నిత్యం పాదచారులు, వాహనదారులతో రద్దీగా ఉండే ఈ రహదారి పూర్తిగా గుంతల మయం కావడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ రహదారికి మరమ్మతు పనులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

గోతులుగా ఉన్న రోడ్డు

తీరని వరద కష్టాలు

- ప్రవాహం తగ్గని సోకులేరు వాగు
- పడవల్లోనే ప్రయాణం
- రోడ్లు కొట్టుకుపోవడంతో రవాణాకు ఇబ్బందులు

ప్రజాశక్తి-చింతూరు

గోదావరి, శబరి వరద ఉధృతి తగ్గినా, ముంపు గ్రామాల ప్రజలకు వరద కష్టాలు ఇంకా తీరలేదు. మండలంలో వరదలు తగ్గినా వాగుల్లో నీటి ప్రవాహం తగ్గలేదు. సోకులేరు వాగు నిండుగా ప్రవహిస్తుండడంతో చింతూరు-విఆర్.పురం రెండు మండలాలకు రవాణా సౌకర్యం లేకపోవడంతో పడవలపైనే వాగులు దాటవలసి వస్తోంది. కొయగూరు, కల్లేరు రహదారి వరదలకు కొట్టుకుపోవడంతో ఆంధ్ర - ఒరిస్సా మధ్య రవాణా నిలిచిపోయింది. కుమ్మూరు వద్ద చంద్రవంక వాగు కొంతమేర ఉధృతి తగ్గడంతో ప్రజలు మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు కావలసిన వరి వంగడాలు ఇతరత్రా వ్యవసాయ సంబంధిత పరికరాలు కొనుగోలు చేసేందుకు వాగులు ఆటంగానే ఉన్నాయి. కొన్నిచోట్ల రోడ్లపై వరద మిగిల్చిన బురద ఉండటంతో వాహనాలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్నందున ఈ రహదారులపై రాకపోకలకు ఎవరూ సాహసించడం లేదు. వరద అనంతరం వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్మికులతో బ్లీచింగ్ పౌడర్‌ను జల్లిస్తున్నారు. వర్షాల కారణంగా పెరిగిన దోమల వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఫాకింగ్ చేయాలని, తాగునీటి బోర్లలో క్లోరినేషన్ వేయాలని, మురికి నీటి కాలువలను శుభ్రం చేయాలని, దోమతెరలు అందరికీ చేరేలా అధికారులు చొరవ చూపాలని, మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. భారీ వర్షాలు, వరదల కారణంగా పశువులకు గడ్డి లేకుండా పోయింది. పశువుల దాణా తక్షణమే అందించాలని, పశువులు వ్యాధుల బారిన పడకుండా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చింతూరు మండలంలో ప్రవహిస్తున్న వాగు

పునరావాస కేంద్రాలు, గుడారాల నుండి

స్వగ్రామాలకు వరద బాధితుల పయనం

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శబరి, గోదావరి నదుల్లో వరద ఉధృతి తగ్గడంతో ముంపునకు గురైన వడ్డిగూడెం, ధర్మతాళ్లగూడెం, వడ్డుగూడెం కాలనీ తదితర గ్రామాల ప్రజలు రేఖపల్లిలోని పునరావాస కేంద్రాలు, గుడారాల నుండి తమ స్వగ్రామాలకు శుక్రవారం పయనమయ్యారు. ముంపు సమయంలో తెచ్చుకున్న సామగ్రిని ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. మరో వైపు అడవిలోనూ, గుట్టలపై గుడారాలు వేసుకొని ఉన్న శ్రీరామగిరి, కొల్లూరు, గొందూరు, కొండెపూడి, తుమ్మిలేరు, కన్నాయిగూడెం, చొప్పల్లి, అడవి వెంకన్న గూడెం ప్రజలు అక్కడ నుండి గ్రామాలకు వచ్చి ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు.

ఈ సందర్భంగా వరద బాధితులు మాట్లాడుతూ పునరావాస కేంద్రాలు, గుడారాల్లో 15 రోజుల పాటు ఉన్నామని, తమకు బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పప్పు, నూనె ఒక్కసారి మాత్రమే ఇచ్చారని, పిల్లాపాపలతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మతాలగూడెంలో కొంతమందికే బరకాలు అందాయని, వడ్డీ గూడెంలో కొన్ని కుటుంబాలకే వరద సాయం అందిందని తెలిపారు ముంపుకు గురైన వారికీ సహాయం అందించాలని మండల అధికారులను బాధితులు కోరుతున్నారు. అలాగే ముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబల కుండా పారిశుధ్య పనులు చేయించాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాక్టర్‌తో సామగ్రి ఎక్కించుకొని స్వగ్రామానికి వెళ్తున్న దృశ్యం

రసాభాసగా మండల సమావేశం

అధికారులను నిలదీసిన సభ్యులు

అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరయ్యారు. అకాల వర్షాలతో మండల వ్యాప్తంగా నష్ట పోయిన పంట నష్టాల వివరాలు తెలపాలన మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస బాబుకు పలువురు సర్పంచ్, ఎంపీటీసీలు ప్రశ్నించారు. ముంచింగి పుట్టు మండలంలో వర్షాలకు వంతెనలు, రోడ్లు, కల్వర్టులు తెగి రాకపోకలు స్తంభించాయని, అధికారులు కన్నెత్తి చూడలేదని మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్‌లు ధ్వజమెత్తారు. పంట నష్టాలకు పరిహారం అందించి, చెక్ డ్యాముల మరమత్తులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రోడ్లు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిని రాకపోకలు స్తంభించాయని పున:పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.వర్షాలకు జోలాపుట్టు రిజర్వాయర్ ముంపు ప్రాంతంలోని సుమారు 15 గ్రామాలలో నివాసిస్తున్న ఆదివాసి గిరిజనులు తీవ్ర అవస్థలను ఎదుర్కొంటున్నారన్నారు.ఉచితంగా ఇంజిన్ బోట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన మత్స్యకారులకు లైసెన్సులు మంజూరు చేసి పడవలు, వలలు ఉచితంగా సరఫరా చేసి ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ పాండురంగ స్వామి ప్రభుత్వాన్ని కోరారు.మండలంలో సుమారు 44 పాఠశాలకు భవనాలు లేవని, రేకుల షెడ్లలో విద్యాభ్యాసాన్ని అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొందని ఎంఈఓ కృష్ణమూర్తిని పెదగూడ సర్పంచ్ మండి బాబురావు, సుజనకోట సర్పంచ్ వెంకట రమేష్ ప్రశ్నించారు.మండల కేంద్రంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల హాస్టల్లో డిప్యూటీ వార్డెన్లు , హెచ్ డబ్ల్యుఓలు నైట్ హాల్ట్ ఉండలేదని సర్పంచ్ లక్ష్మణ్ తెలిపారు అన్ని శాఖల సమీక్ష అనంతరం ఎంపీడీవో కిరణ్ కుమార్ మండల స్థాయి అధికారులకు హెచ్చరిస్తూ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బురదగా ఉన్న రహదారి

పెట్రోల్ బంక్ వద్ద బురదమయం

-ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మండల కేంద్రంలోని జిసిసి పెట్రోల్ బంక్ ఎదురుగా బురదమయంగా ఉండడంతో పెట్రోల్, డీజిల్ కోసం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌హెచ్ 516 ఈ హైవే రోడ్డు నిర్మాణం కోసం రోడ్డు కిరువైపులా కాలువలు నిర్మించి మట్టి తీసి వదిలేయడంతో పెట్రోల్ బంకు ఎదురుగా బురద ఏర్పడడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బురద కారణంగా వాహనాలు అందులో దిగబడి పోతున్నాయి. దీంతో, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న బురదను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

శతశాతం ఉద్యోగాలపై సిఎం ప్రకటన చేయాలి

ప్రజాశక్తి- చింతపల్లి: ప్రపంచ ఆదివాసీల దినోత్సవం రోజున 100శాతం ఉద్యోగాలు గిరిజనులకేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ డిమాండ్ చేశారు. శుక్రవారం డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి ప్రపంచ ఆదివాసుల దినోత్సవం జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆగస్టు 9న జీవో నెంబర్ 3 ను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ట్రైబల్ స్పెషల్ డిఎస్సి పోస్టుల భర్తీకి ప్రకటన చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతానికి గతంలో కేటాయించిన నిధులు సక్రమంగా ఖర్చు చేయలేదని, ప్రస్తుతం కూడా ఖర్చుపెడతారనే నమ్మకం లేదన్నారు.జ గిరిజనులకు కేటాయించిన నిధులను పైసా తో సహా సక్రమంగా ఖర్చు పెట్టేలా చంద్రబాబు హామీ ఇవ్వాలన్నారు. పోలవరం బాధితులను ఆదుకునే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న చిన్నయ్యపడాల్, విద్యార్థులు

ముంపులో ఉన్నవారిని గుర్తించరా?

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్మతాళగూడెం వాసుల నిరసన

తహశీల్దారు కార్యాలయం ఎదుట బైఠాయించిన ధర్మతాళగూడెం ప్రజలు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని ధర్మం తాళ గూడెం గ్రామానికి చెందిన వరద బాధిత కుటుంబాలు 14 రోజులుగా నిండా ముంపునకు గురైనా అధికారులు పట్టించుకోలేదంటూ సర్పంచ్ సోడే నరసమ్మ ఆధ్వర్యాన గ్రామస్తులు శుక్రవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కేటాయించిన స్థలాలలో గుడారాలు వేసుకుని ఉన్నామని, తమ బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదని, సరైన సమయంలో నిత్యవసర సరుకులు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంట పాటు ధర్నా నిర్వహించి తహశీల్దారు సయ్యద్ మౌలానా ఫాజిల్‌ను రెవెన్యూ కార్యాలయంలోకి వెళ్లకుండా బాధ్యతలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వరద ముంపు పట్టిన గ్రామాలకు నిత్యవసర సరుకులు అందించకుండా, మైదాన ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులకు నిత్యవసర సరుకులు అందించారని తహసీల్దార్ ముందు వాపోయారు. వరద పట్టిన ప్రాంతాలకే ముందుగా నిత్యావసరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యపై జిల్లా కలెక్టర్‌కు తెలియజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చిక్కాల బాలు, మాదిరెడ్డి సత్తిబాబు, ముత్యాల గౌతం, సుమన్, టిడిపి నాయకులు బొర్రా నరసింహారావు, ముత్యాల చంద్రశేఖర్, ముత్యాల సిద్ధు, పోలీస్ సిబ్బంది, ధర్మతాల గూడెం వరద బాధితులు పాల్గొన్నారు.

గన్నవరంలో వరద బాధితుల నిరసన

ఎటపాక : వరద సహాయం కోరుతూ గన్నవరంలో వరద బాధితులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ కంటె రాజు, సర్పంచ్ గడం భద్రమ్మ, ఉప సర్పంచ్ కందుకూరి స్వర్ణ (శైలజ), గ్రామస్తులు మాట్లాడుతూ గోదావరి వరదల వల్ల ప్రతి ఏటా గన్నవరం గ్రామం ముంపునకు గురవుతుందని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. పొలాలు ముంపునకు గుర్వవ్వడంతో 4నెలల వరకు రైతులు పంటలు వెయ్యడానికి వీలులేదని తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపునకు గురైన తమ గ్రామస్తులకు రూ.3వేల సహాయం, 25 కేజీల బియ్యం అందించాలని కోరారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ పృథ్వీకి శిబిరం వద్దకు చేరుకొని మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గన్నవరంలో నిరసన కార్యక్రమంలో బాధితులతో మాట్లాడుతున్న డిటి

వరద బాధితులకు సహాయం అందజేత

ప్రజాశక్తి- విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధిలోనిఉమ్మడివరం, అన్నవరం, రేఖపల్లి, గ్రామాల్లో వరద బాధితులకు ప్రభుత్వం అందించిన వరద సాయం రూ.3వేలు చొప్పున జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, సర్పంచ్ పూనం సరోజిని, ఎంపీటీసీ, సిపిఎం జిల్లా నాయకులు పూనం సత్యనారాయణ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు నల్లాపు ప్రకాష్‌రావు, సూరిబాబు, టిడిపి నాయకులు ప్రకాష్ రావు, రామారావు, విఆర్వో దూలయ్య, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరుణ్, సిబ్బంది బుచ్చిరాజు పాల్గొన్నారు.

బాధితులకు వరద సాయం అందిస్తున్న జెడ్‌పిటిసి రంగారెడ్డి, సర్పంచ్ సరోజిని, సిపిఎం నేత పూనెం

జెర్రిల రహదారికి మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : చింతపల్లి- జెర్రిల రహదారి అస్తవ్యస్తంగా ఉందని, అదమరిస్తే ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోయే పరిస్థితి ఉందని, ప్రభుత్వం వెంటనే ఈ రహదారికి మరమ్మతులు చేయాలని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పుత్తూరు విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జీకే.వీధి మండలంలోని వంచల, జెర్రిల, మొండిగడ్డ పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలు ప్రజలు చింతపల్లికి రాకపోకలు సాగించడానికి ఇదే ప్రధాన రహదారి అని పేర్కొన్నారు. రహదారి గోతులమయంగా మారి అస్తవ్యస్తంగా ఉండడంతో ప్రజలు రవాణాకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపల్లి, వంచల, చౌడపల్లి మీదగా చింతపల్లికి వెళ్లే మార్గం సక్రమంగా లేకపోవడంతో బస్సులు మల్లుమెట్ట నుంచి వంచల, కొత్తపాలెం మీదగా జెర్రిల, మొండిగడ్డ వరకు వెళ్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఇన్ని కష్టాలు పడుతున్నా మూడు పంచాయతీల సర్పంచులు సమస్యను అధికారుల దృష్టికి నేటికీ తీసుకెళ్లలేదని ఆరోపించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వనపల ఈశ్వరరావు, ఆడార కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశ్రమాల్లో సమస్యలపై ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-పాడేరు:ఆశ్రమ పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, స్థానిక తలారిసింగి సిప హెచ్ స్కూలు విద్యార్థుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం ఐటీడీఏలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కార్తీక్ శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు చిన్నారావు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ఏజెన్సీ 11 మండలాల్లో అన్ని హాస్టల్స్ లో మెనూ ప్రకారం భోజనం పెట్టటం లేదని, దీంతో, విద్యార్థులు పౌష్టికాహారం లోపంతో రక్తహీనతతో, మలేరియా, టైఫాయిడ్ లతో అనేకమంది బాధపడుతున్నారని పిఓ దృష్టికి తీసుకొచ్చారు. హెల్త్ అసిస్టెంట్లను నియమించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.తలారి సింగి సీప హెచ్ స్కూల్లో నెలకొన్న సమస్యలపై వెంటనే స్పందించాలని కోరారు. ఈ మేరకు హాస్టల్ రూమ్స్ ను వెంటనే మార్చాలని. బాత్ రూమ్స్, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించాలని సుమారుగా40 సంవత్సరాలు కావడంతో హాస్టల్ గదులు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. సమస్యలను పరిష్కారం చేస్తామని పిఓ తెలిపారని నాయకులు పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాఠశాలల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని శివలింగపురం ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి వైద్యాధికారి జ్ఞానేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వరి మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న పాఠశాల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.అనంతరం తినే ముందు సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని, గోర్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ నరసింగరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల :సులబం పంచాయతీ వీడిముల గ్రామంలో ఎంపీపీ పాఠశాల స్కూలు ఆవరణలో స్థానిక సర్పంచ్ హనుమంతరావు ఆధ్వర్యంలో జిమాడుగుల వైద్య సిబ్బందితో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.పలువురికి రక్త పరీక్షలు చేసి తగు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

కాలేజీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ కాలేజీ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విస్వనాథ్ వి.లక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టరుకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, హాస్టళ్లలో మౌలిక వసతులు, సొంత భవనాలు ముఖ్యమన్నారు. జిల్లా వ్యాప్తంగా 18 బిసి కాలేజీ హాస్టళ్లు ఉండగా, దశాబ్దాలు గడుస్తున్నా మూడు హాస్టళ్లకు తప్ప, మిగతా హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించలేదని తెలిపారు. ఏ ఒక్క ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లలో కూడా సరైన తాగు నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులే బయట నుంచి టిన్నులతో ప్రతి రోజూ నీరు తెచ్చుకుంటున్నారన్నారు. హాస్టళ్లలో కుక్, కమాటి, వాచ్‌మెన్ సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమిస్తున్నారు తప్ప, రెగ్యులర్ స్టాఫ్ ఎక్కడా లేదని తెలిపారు. జిల్లాలోని 3 బిసి కాలేజీ హాస్టళ్లలో వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటికి వేరే హాస్టల్ వార్డెన్లు ఇంఛార్జిగా కొనసాగుతున్నారని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నా వైద్య తనిఖీలు జరగడంలేదని ఆవేదన వెలిబుచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

-మీకోసం లో 131 వినతుల స్వీకరణ
-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రజా సమస్యల పరిష్కారం దిశగా సత్వర పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశమందిరంలో ఐటిడిఏ పిఓ వి. అభిషేక్, డి.ఆర్.ఓ బి.పద్మావతితో కలిసి మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 131 ఫిర్యాదులను స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు, భూ సమస్యలు, కళాశాలలు, పాఠశాలల ప్రవేశాలు కల్పించాలని ఎక్కువ ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూలో 105, ఇరిగేషన్ శాఖలో 6, పంచాయితీరాజ్ 1, డుమా 1, గృహ నిర్మాణ శాఖ 1, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో జిఎస్‌డబ్ల్యూ ఎస్ 1, బి.సి. సంక్షేమశాఖలో 1 ఫిర్యాదులను పరిష్కారించాల్సి ఉందన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎందుకు జాప్యం జరిగిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను జాప్యంలో లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

మీకోసంలో స్వీకరించిన వినతులు

అనంతగిరి మండలం పెదలబుబు పంచాయతీ బిస్టుంగుడ గ్రామానికి చెందిన కిల్లో చంద్రశేఖర్ పుట్టగొడుగులు పెంపకానికి రూ.3 లక్షలు రుణం మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు.

పెదబయలు మండలం రూడకోట పంచాయతీ పెదకొండ గ్రామానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్నామని పొంగి మన్మధరావు, పి.గణపతిరావు కోరారు. అనంతగిరి మండలం చిలకలగెడ్డ పంచాయతీ దాసరితోట గ్రామంలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని డి.నాగ మణి, కె.సీతమ్మ తదితరులు వినతి పత్రం సమర్పించారు.

అనంతరం తల్లిపాల వారోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. హెచ్.పి.సి. ఎల్ సంస్థ స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వితరణ చేసిన అంబులెన్సును జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిసివివి ఎస్. శర్మ, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా, డిఐ ఓ సాధన, ఐసిడిఎస్ పిడి. సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇలు డి.వి.ఆర్. ఎం.రాజు, కె. వేణు గోపాల్, ఇఇ అప్పారావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్ . కుమార్, పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు నరసింహులు పాల్గొన్నారు.

పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

తల్లి పాలపై అవగాహన కల్పిస్తున్న పిఒ శారద

ప్రజాశక్తి -యంత్రాంగం

అరకులోయ రూరల్:మండల కేంద్రంలోని అంగన్వాడీ 2 కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఐసిడిఎస్ పిఒ శారద మాట్లాడుతూ, ఈనెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలతో కలిగే ఉపయోగాలను వివరించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి అరుణ, గన్నెల పిహెచ్‌సి డాక్టర్ కమల, అంగన్వాడీ టీచర్ భవాని, లక్ష్మి లక్ష్మిసునీత, రత్నం నిర్మల, మహేశ్వరి,తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలం లోని పట్టం పంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఓ సిహెచ్ బాలామణి దేవి మాట్లాడుతూ, తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిమాడుగుల: మండలంలో పాలమామిడి పంచాయతీ చిన్న బంధ వీధి, కె కోడపల్లిలో తల్లిపాల వారోత్సవాలను సిడిపిఓ సువర్ణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు ఎస్.విజయలక్ష్మి, ఎస్.సత్యవతి, ఎం. లక్ష్మీ గ్రామస్తులు పాల్గొన్నారు.

రంపచోడవరం :తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలం పెద్ద గద్దాడ నవీవాయలం పరిధిలో శుక్రవారం అమ్మపాల విశిష్టతను తెలుపుతూ అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్వాడి సెంటర్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో రంపచోడవరం సిడిపిఓ సంధ్యారాణి మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠమన్నారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలని సూచించారు.

నేడు తల్లిపాలపై సమావేశం

అనంతగిరి:ఈనెల ఎనిమిదో తేదీ వరకు నిర్వహించే తల్లిపాలు వారోత్సవంలో భాగంగా ఈనెల 3న శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ సమావేశ మందిరంలో సిడిపిఓ సంతోషికుమారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎన్.సూర్యలక్ష్మి హాజరవుతున్నారని తెలిపారు.

రంపచోడవరం మండలం గద్దాడలో అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ సుధారాణి

గర్భిణిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

గిరిజనులకు తప్పని డోలి కష్టాలు

-అవస్థలు పడ్డ గర్భిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని అతి మారుమూల ప్రాంతమైన లక్ష్మీపురం పంచాయతీకి చెందిన దొరగుడా గ్రామంలో నివసిస్తున్న వంతల పోర్తిమ అనే గర్భిణికి గురువారం నుండి పురిటి నొప్పులు ప్రారంభ మయ్యాయి. తప్పని పరిస్థితుల్లో శుక్రవారం సుమారు 8 కిలోమీటర్లు కాలినడకన కుటుంబ సభ్యులు మోసుకొచ్చి ఉబ్బేంగుల, బిర్రిగూడ గ్రామల సమీపంలో గల రెండు వాగులు దాటించి ప్రభుత్వ అంబులెన్స్‌లో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పరికరాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త అధికారులు

చెరకు సాగుపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మత్స్యపురంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (అనకాపల్లి) ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక కింద గిరిజన రైతులకు మేలైన చెరుకు యాజమాన్య పద్ధతులు పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త (చెరుకు) ఆదిలక్ష్మి మాట్లాడుతూ, చెరుకు పంట సాగుపై మక్కువ చూపించాలన్నారు. ప్రకృతి సహజ సిద్ధంగా నాణ్యంగా చెరుకు పండించాలన్నారు.ఇందులో భాగం గా రైతులకు ఎరువులు, పరికరాలు పంపిణీ చేశామన్నారు కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సరిత, చంద్రశేఖర్, ప్రదీప్ కుమార్, లీలావతి పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి -ఎంవిపి. కాలనీ: చేనేత వస్త్రాలు ధరించడం ద్వారా చర్మ సంబంధిత వ్యాధులు దరిచేరవని వీ హెల్త్ కేర్, వీ డెంటల్ హాస్పిటల్స్ డైరెక్టర్ కెఎంకె.రమేష్ అన్నారు. స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటీ ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీన బీచ్ రోడ్‌లో నిర్వహించనున్న 3 కిలోమీటర్ల సారీ వాక్ పోస్టర్‌ను శుక్రవారం వీ డెంటల్ హాస్పిటల్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న సారీ వాక్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని స్పిరిట్ ఆఫ్ వైజాగ్ సొసైటి ప్రతినిధి డాక్టర్ బిపిఎస్.కల్యాణి అన్నారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మి, సిహెచ్.పార్వతి, కె.రమ్య, పి.అశోక్, మేరి, తులసి, రాజ్య లక్ష్మి, ప్రశాంతి, పావని, సీత పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు

పారిశుద్ధ్య పనుల పరిశీలన

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపిటిసి వంశీ

ప్రజాశక్తి-రంపచోడవరం :మండలంలోని తామరపల్లి పంచాయతీ పరిధి ఈతలపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పారిశుధ్య పనులను ముసురుమిల్లి ఎంపీటీసీ వంశీ పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు తప్పకుండా వాడాలని, నీళ్ల నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనుల్లో భాగంగా గ్రామ పరిసరాల్లో బ్లీచింగ్, లార్వా మందులు పిచికారీ చేశారు. అనంతరం జిపిఎస్ పాఠశాలలో పరిసరాలను పరిశీలించి పిల్లలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్, మహిళ పోలీస్ కృష్ణవేణి, డిజిటల్ అసిస్టెంట్ హరి, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-సీలేరు: స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పింగళి వెంకయ్య పాత్రపై ఈ పోటీలు జరిగాయి. సీఈసీ గ్రూపునకు చెందిన పి.సంకీర్తన ప్రథమ స్థానం, హెచ్ఇసి గ్రూపునకు చెందిన వెంకటలక్ష్మి ద్వితీయ స్థానం సాధించారు. వీరికి జాతీయ సేవా పథకం ఆఫీసర్, కామర్స్ లెక్చరర్ డి.శ్రీను వితరణగా ఇచ్చిన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.శంకర్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఈ వ్యాసరచన పోటీలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వలకు చిక్కిన గెలాస్కోపి చేప

ప్రజాశక్తి -సీలేరు: అరుదైన గెలాస్కోపి చేప జీకే వీధి మండలం సీలేరు నదిలో మత్స్యకారుల వలకు శుక్రవారం చిక్కింది. 15 కేజీలు బరువు ఉంది. ఇంతకుముందు సీలేరు నదిలో గెలాస్కోపి జాతికి చెందిన చేపని శాస్త్రవేత్తలు సేకరించి పరిశోధనలు చేసి ఔషధ గుణాలు ఉన్నట్లు గుర్తించారని పలువురు చెబుతున్నారు. కేజీ రూ.200 చొప్పునవిక్రయించారు. ఈ అరుదైన చేప సీలేరు నదిలో లభ్యమవుతుంటాయి. ఏడాది సీలేరు నదిలో మూడు చేపలు దొరికాయి.

చేపను చూపుతున్న ఎపి జెన్‌కో ఎఇఇ సురేష్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి-సీలేరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని జీకే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. జీకే వీధి మండలం గుమ్మళగొంది గ్రామంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. పంచాయతీ సరఫరా చేసిన మంచి నీటిని కాశి చల్లార్చి తాగాలని, కుళ్లిన చేపలు, నిల్వ ఉన్న మాంసం తక్కువ ధరకు లభిస్తున్నాయని కొనుగోలు చేసి తినొద్దని హితవుపలికారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, మురికి గుంతల్లో నీరు లేకుండా చూసుకోవాలని కోరారు. గ్రామ పురవీధుల్లో శుభ్రపరిచి బ్లీచింగ్ జల్లారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డి.పాపారావు, ఆసుపత్రి సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి వేతన బకాయి చెల్లించాలని నిరసన

ప్రజాశక్తి - ఎటపాక : ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు బకాయి పడ్డ కూలీ డబ్బులను తక్షణమే చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన మండలంలోని వీరాయిగూడెం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ గత మూడు నెలలుగా ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని తెలిపారు. వ్యవసాయం దెబ్బతిని అందరూ ఉపాధి హామీ పనులపై ఆధారపడి ఉన్నారని, ఇటువంటి సమయంలో మూడు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు వరద, తుఫానులతో కూలీలకు పనులు దొరక్క, చేసిన పనికి డబ్బులు రాక ఉపాధి కూలీల కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. మే, జూన్, జులై నెలల ఉపాధి హామీ బిల్లులు కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని, నిధులు విడుదల చేశామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, లబ్ధిదారుల ఖాతాలోకి జమ కాలేదని పేర్కొన్నారు. వరద ముంపుతో సంబంధం లేకుండా మండలంలోని ఉపాధి హామీ కూలీలందరికీ బకాయిలు చెల్లించాలని ఐవి డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆకిశెట్టి రాము, ఇరప సత్యం, హుస్సేన్, తోట శ్రీను, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న కూలీలు

ఆశా, అంగన్వాడీలకు వరద సాయం అందించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి చింతూరు : వరద ముంపునకు గురైన గ్రామాల్లో ప్రజలతో పాటు ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు కూడా వరద బాధితులేనని, ప్రజలతో పాటు ఆశా, అంగన్వాడీ వర్కర్లకు కూడా వరద సాయం అందించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన వరద సహాయం రూ.3000 ముంపు గ్రామాల్లో ఉన్న ఆశా, అంగన్వాడీ వర్కర్లకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. గత 20 రోజులుగా వరదలకు గురైన గ్రామాల్లోని అంగన్వాడీ, ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులు పడుతూనే అక్కడ ఉన్న వరద బాధితులకు మెరుగైన సేవలు అందించారని తెలిపారు. వారిని ప్రభుత్వం ఉద్యోగులుగా పరిగణించి కొన్నిచోట్ల వరద సాయం డబ్బులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు కాదని చెప్పి అతి తక్కువ వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం, వరద సాయం ఇవ్వాల్సి వచ్చే సరికి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం దుర్మార్గమన్నారు. పైనుండి ఎటువంటి సర్క్యులర్లు లేకపోయినా స్థానిక అధికారులు వరద సహాయం డబ్బులు ఇవ్వకుండా ఆపడం అనేది భావ్యం కాదన్నారు. అంగన్వాడీ, ఆశాలకు నాలుగు మండలాల్లోని కొన్నిచోట్ల ఇచ్చి కొన్నిచోట్ల ఆపుతున్నారని, అన్ని చోట్ల వరద సహాయం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే ఐటిడిఎ పిఒ స్పందించాలని కోరారు.

గంజాయి అనర్థాలపై అవగాహనా ర్యాలీ

పోలీసుల ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సీలేరు:గంజాయి అనర్థాలపై జీకే వీధి మండలం పెదవలస వారపు సంతలో పోలీసు శాఖ ఆధ్వర్యాన జిటిడబ్ల్యూఏ విద్యార్థులచే శుక్రవారం భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. గంజాయి వద్దు ఆరోగ్యమే ముద్దు అంటూ విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జికె.వీధి సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ గంజాయి సాగు, అక్రమ రవాణా యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పోలీసులు గంజాయి నిర్మూలన దిశగా చేపట్టిన ఆపరేషన్ పరివర్తనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గంజాయి సాగు, అక్రమ రవాణా విరమించుకోవాలని కోరారు. విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి, సిఆర్పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన సర్పంచ్

ప్రజాశక్తి-విఆర్.పురం :మండలంలోని రేఖపల్లి పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను ఆ పంచాయతీ సర్పంచ్ పూనం సరోజిని శుక్రవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్క వరదలు, మరోపక్క భారీ వర్షాలతో రేఖపల్లి గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. మండలంలో ముంపునకు గురైన గ్రామాలు రేఖపల్లిలోని పునరావాస కేంద్రాల్లో ఉన్నారని, ఈ నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందుతుందా? లేదా? అనేది పరిశీలించినట్లు చెప్పారు. వరద బాధితులతో పాటుగా పిల్లలు ఉన్నారని, పిల్లలకు కావలసిన పోషక ఆహారం ఇస్తున్నామని కేంద్రం నిర్వాహకులు తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని సర్పంచ్ సూచించారు.

అంగన్వాడీ కేంద్రం పరిశీలనలో సర్పంచ్ సరోజిని

సిహెచ్‌సికి మరో డయాలిసిస్ మిషన్

- కలెక్టర్, ఐటిడిఎ పిఒ చొరవతో ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మరో డయాలిసిస్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సిహెచ్‌సిలో అపోలో డయాలసిస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి ద్వారా 5 డయాలసిస్ మిషన్లతో 2020లో డయాలసిస్ సేవలు ప్రారంభించారు. రోగుల సంఖ్య పెరగడంతో మరో రెండు మిషన్లు పెంచి మూడు షిఫ్ట్‌ల్లో సేవలు అందించారు. ఈ విధంగా ఇంతవరకు 15,720 సెషన్స్‌లో డయాలసిస్ సేవలు అందించారు. డయాలసిస్ రోగుల సంఖ్య క్రమంగా పెరగడం, ఏడు మిషన్లు చాలకపోవడంతో రోగులు పడుతున్న ఇబ్బందులను గమనించిన చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య సమస్యను అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అపోలో డయాలసిస్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ ఇండియా మేనేజర్ మధు కిరణ్‌తో ప్రాజెక్టు అధికారి మాట్లాడి అదనపు డయాలసిస్ మిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అపోలో డయాలసిస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు స్పందించి దాదాపు రూ.9 లక్షలతో డయాలసిస్ మిషన్, హైడ్రాలిక్ బెడ్, అనుబంధ పరికరములు శుక్రవారం చింతూరు ఆసుపత్రికి పంపించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి మాట్లాడుతూ శనివారం నుండి కొత్త మిషన్ ద్వారా సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సమస్యను సత్వరం పరిష్కరించినందుకు జిల్లా కలెక్టర్‌కి, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, అపోలో డయాలసిస్ యూనిట్‌కు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ కృష్ణారావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, డయాలిసిస్ రోగులు ధన్యవాదాలు తెలిపారు.

చింతూరు సిహెచ్‌సికి ఏర్పాటు చేసిన మరో డయాలిసిస్ మిషన్

బందెల దొడ్డికి వేలం పాట

ప్రజాశక్తి- విఆర్.పురం :మండలంలోని రేఖపల్లి పంచాయతీలో సర్పంచ్ పూనం సరోజినీ అధ్యక్షతన శుక్రవారం బందెల దొడ్డికి వేలం పాట నిర్వహించారు. వేలం పాటను చీమల వెంకన్న దక్కించుకున్నారు. ఈ సందర్భంగా సరోజిని సర్పంచ్ మాట్లాడుతూ ఆగస్టు 10వ తేదీ నుండి ఈ వేలం అమలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గేదెకు రూ.300, ఎద్దుకు రూ.200, దూడకు రూ.100, మేక, గొర్రెలకు రూ.50 వసూలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. పశువు దారులు తమ పశువులను వదిలిపెట్టకుండా కాపు కాసుకోవాలని, లేకుంటే పంటలు పాడైపోయి రైతులు నష్టపోతారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లానేత పూనం సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శి శివ ప్రసాద్, సిబ్బంది, వైసిపి నేతలు రైతులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి-రంపచోడవరం :రంపచోడవరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో రంప చోడవరం జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ ప్రాంగణంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, ఫస్ట్ క్లాస్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ పి.బాబు, డాక్టర్ పి.కృష్ణ పవన్, పానెల్ న్యాయ వాదులు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కాలంలో వచ్చే రోగాలకు పరీక్షలు చేయించుకోవాలన్నారు. వాడే మందుల పట్ల జాగ్రత్త వహించి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు.